క్లుప్తంగా

వేడుకగా దుర్గామాత విగ్రహ ఊరేగింపు



నర్సంపేట : పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం ముగిసిన క్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చకిలం కృష్ణమూర్తి, సభ్యులు గర్రెపల్లి శ్రీనివాస్, మదనపల్లి ఉపేంద్ర ఆధ్వర్యంలో దుర్గామాతను వేడుకగా ఊరేగించారు. బ్యాండ్ మేళా, నృత్య ప్రదర్శనలు, కోలాటాలతో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించగా శింగిరికొండ మాధవశంకర్ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో పబ్బ రమేష్, తోట బాలభాస్కర్ గుప్తా, గోవర్ధన్, బ్రాహ్మణపల్లి సుమన్, శ్రీరాం కిరణ్, చకిలం శ్రీకాంత్, మల్యాల మల్యాల ప్రవీణ్, మల్యాల రాజు, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని ఖాదర్‌పేట అభివృద్ధికి, రామాలయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని బీజేపీ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు దామెరుప్పుల శేఖర్ కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరారు. శేఖర్ శనివారం సంజయ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేశారు. అనంతరం సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు కోరె రాకేశ్, పడిదం హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో యువసేన యూత్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులను శాలువాలతో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు పంచాయతీ కార్మికుల సేవలను కొనియాడారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు ఉప్పుల సందీప్, గజవెల్లి ప్రదీప్, గడ్డం శోభన్, నిమ్మల మహేశ్, బండి రాజు, ఉప్పుల హరీశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద శివారులోని ఆకేరు వాగు ఒడ్డున ఉన్న శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఆలయంలో ఉన్న రెండు హుండీలను ధ్వంసం చేసి కానుకలను ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకులు ఫిర్యాదు చేయగా పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. గతంలోనూ ఆలయంలో పలుమార్లు చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేసి చోరీలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



వర్ధన్నపేట : మండలంలోని ఆకేరు వాగు నుంచి ఇసుక లోడుతో శనివారం వెళ్తున్న ట్రాక్టర్ ఇల్లంద శివారులో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై లక్ష్మి ఫంక్షన్ హాలు సమీపంలో అడ్డు వచ్చిన పశువులను తప్పించబోయిన బోల్తాపడింది. దీంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని జేసీబీ సహాయంతో బోల్తా పడిన ట్రాక్టర్ ట్రైలర్‌ను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఆర్థికసాయం

సంగెం : మండలంలోని కుంటపల్లికి చెందిన కద్దూరి సంజీవ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి పులి రాజశేఖర్ ఆధ్వర్యంలో పాల కేంద్రం రైతులు శనివారం రూ.5 వేల సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గోలి అశోక్, సింగం రాజు, యార శ్రీకాంత్, ఎరుకల శంకర లింగం, పెంతల శ్రవణ్, పెడ్లి శంకర్, నాయకులు బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఇక వృద్ధుల, దివ్యాంగుల సంఘాలు

● ఏర్పాటు దిశగా పల్లెల్లో స్పెషల్ డ్రైవ్

గీసుకొండ : ఇక వృద్ధులు , దివ్యాంగులు, బాలికల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు కానున్నాయి. ఆ దిశగా పల్లెల్లో స్పెషల్ డ్రైవ్ నడుస్తోంది. ఇప్పటికే గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) ద్వారా ఏర్పాటైన మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ఉండగా కొత్తగా వృద్ధులు, దివ్యాంగుల, కిశోర బాలికల కోసం ప్రభుత్వం ఇటీవల ఇందిరా మహిళా శక్తి మిషన్ –2025 కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో 60 ఏళ్లకుపైబడిన మహిళలు, దివ్యాంగులు, 15–18 ఏళ్ల వరకు వయస్సున్న కిశోర బాలికలతో సంఘాలు ఏర్పాటు చేయనున్నారు.

అర్హుల గుర్తింపు ఇలా..

గ్రామంలో సంఘాల్లో చేరని వారి సంఖ్య ఆధారంగా అర్హులను గుర్తిస్తారు. ఓటరు జాబితా, ఉపాధి కూలీల జాబ్ కార్డులు, రేషన్ కార్డులు, పింఛన్ పొందుతున్న మహిళలు, దివ్యాంగుల వివరాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ సంఘాల సభ్యులకు మహిళా శక్తి, సెర్ప్–ఎన్ఆర్ఎల్ఎం నుంచి ప్రయోజనం పొందే వీలు ఉంటుంది. ఏపీఎంలు, సీసీలు ఇప్పటికే గ్రామస్థాయిలో వీఓఏలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామం లేదా ఓ వీధి యూనిట్‌గా 10–15 మందితో వృద్ధ మహిళా సంఘాలను, 5–10 మందితో దివ్యాంగుల సంఘాలు, 15–18 ఏళ్ల వయస్సున్న వారితో కిశోర బాలికలకు సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు.



మండలంలో ఇటీవల కొత్తగా ఏర్పాటైన వృద్ధ మహిళా సంఘం సభ్యులు

సామాజికంగా, ఆర్థికంగా ప్రోత్సహించేలా..

సంఘాలుగా ఏర్పడిన మహిళలను సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా ప్రోత్సహిస్తారు. సంఘాల ద్వారా జీవనోపాధి, వ్యాపార కార్యకలాపాలు పెంపు, ప్రభుత్వం నుంచి రివాల్వింగ్ ఫండ్, వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు, బీమా, తదితర సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. వృద్ధ మహిళా సంఘాల్లోని సభ్యులకు సామాజిక భద్రత, హక్కుల పరిరక్షణ, ఆరోగ్య, మానసిక సమస్యలపై వివిధ శాఖల ఆధ్వర్యంలో సేవలు అందిస్తారు. దివ్యాంగుల సంఘంల్లోని వారికి చట్టంపై అవగాహన కల్పించి వారి హక్కుల, భద్రత, ఆదాయాభివృద్ధికి రుణ సదుపాయం, కృత్రిమ అవయవాలు, పరికరాల పంపిణీ, తదితర కార్యక్రమాలు చేపడతారు. కిశోర బాలికల సంఘాల ఏర్పాటుతో బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడంతోపాటు వారి వికాసానికి బాటలు వేయనున్నారు.

జిల్లాలోని సంఘాల వివరాలు

మొత్తం వీఓలు - 435

మొత్తం ఎస్‌హెచ్‌జీలు : 11,358

మొత్తం సభ్యులు : 1,23,013

అంచనా వృద్ధ మహిళల సంఘాలు : 420

అంచనా దివ్యాంగ మహిళల సంఘాలు : 220

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయండి

నల్లబెల్లి : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను, సిబ్బందిని మండల ప్రత్యేకాధికారి దేవేందర్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన సదుపాయాలు, వసతుల, ఇతరత్రాపై చర్చించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రణాళికాయుతంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రవి, ఎస్సై గోవర్ధన్, పీఆర్ శాఖ ఏఈ అమీర్ సల్మాన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

నియమావళిపై అవగాహన కీలకం



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్, ఎస్సై వంశీకృష్ణ

● సీఐ రాజగోపాల్

సంగెం : ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రజలకు, రాజకీయ పార్టీల శ్రేణులకు అవగాహన కీలకమని పర్వతగిరి సీఐ రాజగోపాల్ తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్, ఎల్గూర్ స్టేషన్, ఎల్గూర్ రంగంపేట, బీకోజీనాయక్‌తండా, కొత్తగూడెం, గాంధీనగర్, తీగరాజుపల్లి, తదితర గ్రామాల్లో శనివారం ఆయన ద్విచక్ర వాహనాలపై తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రజలు సహకరించాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో నిషేధిత వస్తువుల అక్రమ వ్యాపారాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కేసుల పాలై ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై వంశీకృష్ణ, కానిస్టేబుళ్లు శంకర్, అమీర్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



నర్సంపేట రూరల్ : ప్రజలకు బాకీ కార్డులు అందిస్తున్న సత్యనారాయణ, తదితరులు

● ఎన్నికల పరిశీలకుడు సత్యనారాయణ

నర్సంపేట రూరల్ : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల పరిశీలకుడు నామాల సత్యనారాయణ, కన్వీనర్ కోమాండ్ల గోపాల్‌రెడ్డి విమర్శించారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన బాకీ కార్డులను నర్సంపేట మండలంలోని చిన్నగురిజాలలో శనివారం వారు ఆవిష్కరించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల కోసం గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు కొడారి రవి, మోటూరి రవి, బండారి రమేశ్, భూక్యా వీరన్న, చిన్నపెల్లి నర్సింగం, గడ్డం కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎన్నికల కన్వీనర్ బత్తి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. ఓటర్లందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వల్లెపు శ్రీనివాస్, ఆబోతు అశోక్ యాదవ్, వడ్డె రాజశేఖర్, బాలకిషన్, భూక్యా వెంకన్న, మచ్చిక అశోక్, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : కార్డులు అందిస్తున్న నాయకులు



నల్లబెల్లి : కార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు

నల్లబెల్లి : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బాకీ కార్డులను నాయకులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని కోరారు. ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలెపు రాజేశ్వర్‌రావు, నాయకులు పోగుల చిరంజీవి, ఇంగ్లె శివాజీ, నానబోయిన రాజారాం, మామిండ్ల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై రేపు సదస్సు

సంగెం : రెండో సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కల్పించడానికి మండల పరిషత్ కార్యాలయంలో రేపు (ఈనెల 6న) ఉదయం 11 గంటలకు రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులకు సదస్సు నిర్వహిస్తామని ఎంపీడీఓ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ ఎన్నికల కోసం ఈనెల 9 నుంచి 11 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 23న ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఈనెల 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరించి నవంబర్ 4న ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సదస్సుకు రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బైండోవర్



వర్ధన్నపేట : పట్టణానికి చెందిన మంగళపెల్లి వెంకన్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది శనివారం చేసిన దాడుల్లో నాలుగు లీటర్ల నాటుసారాతో పట్టుబడగా ఆయన్ను తహసీల్దార్ విజయసాగర్ ఎదుట ఆ శాఖ సీఐ స్వరూప బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ స్వరూప మాట్లాడారు. నాటుసారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



తరుణ్

గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపెల్లికి చెందిన బీటెక్ విద్యార్థి నామని తరుణ్ శుక్రవారం నుంచి కనిపించడం లేదని అతడి సోదరుడు అరుణ్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. కిరాణా సామాను తీసుకురావడానికి ఇంటి నుంచి ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తెలిసిన వారి, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అరుణ్ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

● సీఐ విశ్వేశ్వర్

గీసుకొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని స్థానిక సీఐ విశ్వేశ్వర్ కోరారు. పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు శనివారం ఆయన కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా గొడవలకు పాల్పడవద్దని, పంచాయతీల్లో తలదూర్చొద్దని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ విశ్వేశ్వర్

గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరేస్తాం



బీజేపీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

● జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరేస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని చెరువు కొమ్ముతండా, వాంకుడోతుతండా, జరుపులతండా, వాల్యతండా గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు జరుపుల బాలు, లాలు, వాలు, చందూలాల్, నర్సు, తార్య, ఈర్య, బోడ రవీందర్, రమేశ్, గణేశ్, రాజేందర్, రాజేందర్, నవీన్, తదితరులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి పాల్తియా శౌందర్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధక్షుడు దామెరుప్పల శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కీసరి సాంబరాజు, మురహరి విజయ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, నాయకులు దయాకర్, తాళ్లపెల్లి రాము, విఘ్నేష్, జూలూరి మనీశ్, బానోత్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

● మండల అధ్యక్షుడు సారంగపాణి

సంగెం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని గవిచర్లలో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల అమలులో, సుపరిపాలన అందించడంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. తద్వారా బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చెప్పారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, నాయకులు దొనికెల శ్రీనివాస్, చెన్నూరి యాకయ్య, లింగాల రవీందర్‌రెడ్డి, ముదిడె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సారంగపాణి

‘సీఐపై ఆరోపణలు సరికాదు’

నర్సంపేట రూరల్ : నర్సంపేట టౌన్ సీఐ రఘుపతిరెడ్డిపై ఆరోపణలు చేయడం సరికాదని ఎస్‌హెచ్ఆర్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేశ్ అన్నారు. చెన్నారావుపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా పండుగ రోజు నర్సంపేటలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో బొడ్రాయి ఆవరణలో జంతు బలి ఇవ్వగా సీఐ బందోబస్తుకు వచ్చారని తెలిపారు. జంతుబలికి, సీఐ సంబంధం లేదన్నారు. కొందరు ఉద్దేశ పూర్వకంగా సీఐపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గూడూరు : మండలంలోని మర్రిమిట్ట శివారు బందాలగడ్డతండాలో శనివారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. రైతు బానోతు వెంకన్న కథనం ప్రకారం.. తన వ్యవసాయ బావికి విద్యుత్ మోటార్ సరఫరా కోసం అమర్చిన వైర్ తెగి కిందపడింది. అటుగా మేతకు వెళ్లిన పాడి గేదె వైర్‌ను తాకి అక్కడికక్కడే మృతి చెందింది.

రేపు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

నర్సంపేట : ఈనెల 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించనున్న క్రమంలో రేపు (ఈనెల 6న) అటవీ శాఖ, లీడ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు ‘వన్యప్రాణులను కాపాడుదాం, ప్రకృతిని పరిరక్షించుదాం (సేవ్ వైల్డ్ లైఫ్–సేవ్ నేచర్)’ అంశంపై వ్యాసరచన పోటీలు, ‘అందమైన అటవీ దృశ్యం (ఎ బ్యూటిఫుల్ ఫారెస్ట్ సీన్)’ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు నర్సంపేట ఎఫ్ఆర్ఓ రవికిరణ్, లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడారు. పోటీలో పాల్గొనదల్చిన విద్యార్థులు సెల్ నంబర్ 7981068048కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 6న పాకాలలో ఉదయం పోటీలు నిర్వహించి అదే రోజు విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేస్తామని తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించే దిశగా తలపెట్టిన పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు.

నేడు భవన నిర్మాణ రంగ కార్మికుల మహాసభ

ఐనవోలు : హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో నేడు (ఆదివారం) ఉదయం 10 గంటలకు యూనైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా నాల్గో మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బోళ్ల వెంకటస్వామి, ఇస్రం సుదర్శన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాసభకు రాష్ట్ర కార్యదర్శి కోటం రాజు హాజరు కానున్నారని పేర్కొన్నారు. మండలంలోని భవన నిర్మాణ రంగ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇద్దరిపై కేసు

ఐనవోలు : బీఆర్ఎస్ మండల కన్వీనర్ తంపుల మోహన్, అతని సోదరుడు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొండపర్తికి చెందిన గుండోజు రాజు హైదరాబాద్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. దసరా పండుగకు స్వగ్రామమైన కొండపర్తికి వస్తుండగా తంపుల మోహన్ ఇంటి వద్ద కారు అడ్డుగా ఉండటంతో హారన్ కొట్టాడు. దీంతో తంపుల మోహన్, అతని తమ్ముడు వెంకటేశ్ కోపంతో దాడి చేశారు. బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

గుండెపోటుతో రైతు మృతి



రాజు (ఫైల్)

పర్వతగిరి : గుండెపోటుతో రైతు మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏనుగల్‌కు చెందిన వాకిటి రాజు (43) తన చేనులో పత్తి ఏరుతుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలాడు. స్థానికులు ఆర్ఎంపీకి సమాచారం అందించి ఆర్ఎంపీని తీసుకురాగా రాజు అప్పటికే మృతి చెందాడు. రాజు మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

మాజీ ఎంపీటీసీ..



కుమార్ (ఫైల్)

దుగ్గొండి : గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి చెందిన ఘటన మండలంలోని దేశాయిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జిల్లెల సాయి కుమార్(45)కు సాయంత్రం గుండెపోటుకు గురికాగా కుటుంబ సభ్యులు హుటాహుటిన వరంగల్ జిల్లా కేంద్రంలోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం కొద్ది సేపటికే సాయికుమార్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు 2013 నుంచి 2018 వరకు దుగ్గొండి ఎంపీటీసీగా ప్రజలకు ఎనలేని సేవలు అందించాడు. ఆయన మృతితో దేశాయిపల్లి, గుడిమహేశ్వరం, దుగ్గొండి గ్రామాల్లో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని సన్నూరు మాజీ సర్పంచ్ కుందూరు భీష్మారెడ్డి (74) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన 13 ఏళ్లపాటు సర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందించారు. మూడేళ్లపాటు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గానూ పని చేశారు. ఆయన మృతదేహానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నాయకులు జంగా రాఘవరెడ్డి, లేగ రామ్మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. భీష్మారెడ్డి కుమారుడైన విక్రమ్‌రెడ్డిని ఎమ్మెల్యే, నాయకులు పరామర్శించారు.

ధార్మిక పరిషత్ ప్రారంభం

ఖిలా వరంగల్ : వరంగల్ శివనగర్‌లో హిందూ ధార్మిక పరిషత్ పరిషత్ సంస్థను ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య పున్నమాచార్యులు శనివారం ప్రారంభించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొండోజు వీరాచార్యులు, మరుపోజు జగదీశ్వర్, మదుపోజు గురుమూర్తి, నరేందర్, జక్కన్న పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో శ్రీనివాస్

నర్సంపేట : జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి ఆదేశాల మేరకు మినీ స్టేడియం ఇన్‌చార్జ్, కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ఆధ్వర్యంలో దసరా సందర్భంగా స్టేడియంలో కబడ్డీ కోర్టులకు భజరంగీ మూర్తి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమాన్ని ప్రారంభించి స్టేడియంలో శిక్షణ పొందుతున్న కబడ్డీ క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. చెడుపై మంచి గెలిచిన రోజుగా తెలిపారు. విద్యార్థులు రోజూ శిక్షణ పొంది ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.